# తమసః పరస్తాత్

అమ్మణమ్మ పాట, అవాళ మరీ అద్భుతంగా ఉంది.

మోహన చివురించలేదు. కాని సభ యావత్తూ అలా మ్రాన్పడిపోయింది. చంద్రస్థాయిలో కరిగిపోయే ఆలాపనలో, చివరికి నిశ్శబ్దం బ్రహ్మాండంగా నిట్టూర్చింది.

"ఎలా వుంది?" అని మాట వరుసకు ప్రశ్నించాను.....కాని వాడి గొంతు పలకడానికి బిడియపడ్డదో ఏమో, సమాధానం కనుబొమ్మలచేత చెప్పించింది. చూపులు క్రిందనుంచి గిలిగింతలు పెట్టినట్టుగా....అవి ఒక్కసారి, ఎగిరి గంతు వేయబోయి, ఉన్నచోటే కట్టుబడి పోయినవి.

"ఏం, బాగుండలేదా?" అన్నాను వేధింపుగా. వాడి ఊహ ఏమో చూచాయగా నా కర్థమైనా....

"ఎలా బాగుంటుందేం? — అంత చక్కదనం ఒక్కచోట పేరుకుపోయి ఉంటే - ఎబ్బే - తగని అసహ్యంగా ఉండదూ?" - అన్నాడు, నాకన్న ఎన్నడో వీడాకులు ఎక్కువ చదివిన ఆ ప్రబుద్ధుడు.

"అంత అందం యెక్కడిదోయ్ అమ్మణికి ?—" అన్నాను పరమ నిర్లక్ష్యంగా—

— ఆ హంశం ఒక్కదానిమీదా, ఇద్దరమూ ఇహ రగడ పెంచుకున్నాము. వాడు రెచ్చిపోవడము చూసినకొద్దీ, నాకు ముచ్చట వేసుకువస్తూంది. నేను - కొన్ని కారణాలవల్ల తప్పనిసరిగా - దాచేసుకున్న పసితనం, అడపా దడపా, ఇతరులలో మెరసేట్టు చేయడం - అది నాకో సరదా.

ఎంతసేపు పెనుగులాడినా, వాడు పట్టిన కుందేలుకు మరో కాలు మొలుచుకు రావడం లేదు. నేను, నాలిగింటికి పీనపాలు తగ్గడంలేదు.

- నా కళ్ళకే రుజువు చేస్తా నన్నాడు, అమ్మణి యెంత అందగత్తో.

- నాకు తెలియదా, వాడి యెత్తు ఏమిటో? -

"ఈ మాత్రానికి ఇంత నాటకమాడి — ఈ హైరానంతా దేనికిరా? ముందరే అఘోరించలేక పోయినావా - అమ్మణి కరుణా కటాక్ష వీక్షణం ఒకటి నీమీద పారేయించమని! — సరే, నడు—"

— సరే, వాడు నా వెంట నడిచాడు — అమ్మణికి ఎదురుగుండా సోఫాలో ఓ నిమిషం కూర్చుని - తరించాడు. వాళ్ళ యింట్లో బాయ్ తెచ్చి యిచ్చిన చచ్చు కాఫీ- ఎంతో మెచ్చుగా త్రాగాడు. ఆ రీక్ - టాక్‌ల ముందర నోట మాటరాక, అలాగే గ్రుడ్లు అప్పగించి కూర్చున్నాడు.

— చింతలతోపు చిటారు చిగుళ్ళలోంచి చందమామ దీమాగా చూసింది. వాడు, ఆ రాజసం ఇహ భరించలేక, పిల్లి లాగా బయటికి వచ్చేశాడు.

"కళ్ళు నెత్తిమీద ఉన్నాయ్" అనుకున్నాడు, ధుమధుమగా—

"దేనికి?"

"దానికి"

"ఒళ్ళుమటుకు దగ్గిరే పెట్టుకుంటూంది — అది గమనించావా?"

"ఆ – ఆ ఒళ్ళే యెందరి ఇళ్ళో గుల్ల చేసింది!" ఈ మాట యెంత అసూయగా, ఉత్కోశంతో అన్నాడని?

ఆ మాట నిజమే. మెసలీనా అపరావతరం అనుకుంటూంది లోకం అమ్మ ణమ్మను. ఆ అమ్మాయి అమ్మణమ్మ నిజానికి, నా కళ్ళముందు పిల్ల. హృదయాల్లో, సంస్థానాల్లో రగుల్కొలిపిన అగ్నిహోత్రాలు ఈనాటికీ యింకా – హోమగుండాలై ప్రజ్వరిల్లి పోతూన్నవి.

ఆ అమ్మాయి చేసినవీ, చెయ్యనివీ అన్నీ కలిగా పులగంగా, లోకం కథలల్లి చెప్పుకుంటూన్నది

అందాన్ని మించిన పాట. పాటను తలదన్నే అందం. మొత్తానికి రెండూ కూడా విలువ కట్టరానివి.

"ఇది, యెప్పటికీ అణగి మణగి పడుండి మొగుడితో కాపురంచేసే రకం కాదు" అని పసితనంలోనే లోకం అమ్మణమ్మని దీవించింది.

ఆ దీవెన, వాళ్ళనోటి వాక్యాన వేయింతలుగా ఫలించింది. ఒక్క లోకం దక్కించుకోలేదు, అమ్మణమ్మను. ఆ అమ్మాయి పాడుతూంటే, ఏడేడు పధ్నాలుగు లోకాలూ ఆలకిస్తాయి.

"అంతే కాదు, హతమారి తప్పనిసరిగా వీరస్వర్గం చూరగొన్న నాథ – అక్షౌహిణీలన్నీ అలోకించుతాయి" – కథ అంతా విని, అక్కసుగా యిది వాడన్న మాట.

"అలోకించనీయరా! వరంగా సంక్రమించిన అనిమేషత్వమన్నా సార్థక మౌతుంది. ఒరే బాబూ, ఇంత కలికాలంలోనూ నూటికో మహా - యిల్లాలు ఉండ వచ్చును. కాని, ఏ యుగంలోనైనా అమ్మణమ్మలాటి మనిషి కోటికి ఒక్కతైనా కనబడుతుందిటరా? ఆంధ్రుల కళా-చరిత్ర, అమ్మణమ్మ జీవిత చరిత్ర!

పతివ్రతల పవిత్ర నామాలు, ముచ్చటగా ఏ పదిమందో మడిగట్టుకు మనసులో ఉచ్చరించాలిసినవి. ఈలాటి పేరే లోకరాసిక్యానికి దివ్యతారకం.

"కలలోనైనా పరపురుషుణ్ణీ, పట్టపగలైనా మగవాడనే వ్యాజాన సూర్యుణ్ణీ చూడని, ఏ సుబ్బమ్మో రై లుగిగి మన పురం పావనం చేయడానికి వస్తూందంటే స్వాగతం ఇవ్వడానికి ఎంతమంది వెళ్ళతారు? అఖరికి జట్కావాడన్నా, ఆమె అంత యిల్లాలు కదా అని, ఒక్క అణా తక్కువ పుచ్చుకుంటాడా?"

"మరి, అమ్మణమ్మ ఫలానా ఊరు రాబోతున్నదీ అంటే"

"ఊరు ఊరూ, పదిహేనురోజులు కద్దనగానే కట్టకట్టుకు గంగలో దూకు తుంది." వాడికి, అరికాలి మంటలు అప్పటితో నెత్తికి ఎగదన్ని ఆలా పెట్టినవి.

అంతటితో, దానంతట అదే రగడ చల్లారింది. కవ్వించేందుకు, వాడికి ఓపిక లేదు. నవ్వేందుకైనా నాకు విసుగేసింది.

— మసక నీడలో నడుస్తున్నాము. వెన్నెల, కాస్సేపటినుంచీ ఒక మబ్బు చాటున అణిగి పడిఉంది. రోదసి గురకతీస్తూ మసులుతూంది. ఆకాశం తగని బద్ధకంగా ఉంది.

అక్కడ ఓ కొర-కొరలాడే పాత గేటుమీద బిర్ర బిగిసి కూర్చున్న కొక్కెం ఉంది. ఆ సంగతి నాకు తెలుసును.

అది తీసుకు ఉహూ, బలవంతాన పెకలించుకు లోపలికి అడుగుపెడితే, ఎన్నో అడుగులు అలా ఓ దోవా తెన్నూ కనబడకుండా పోయి—పోయి, క్రోటన్ తొట్లు తగిలి ముందుకు బోర్లపడకుండా, క్రీడాసరసిలో బుడుంగ్ మనకుండా ఈ చౌగండాలన్నీ గడచిపోతే, ఆ చీకటి గుయ్యారంలో ఆ యిల్లు ఉందని నాకు తెలుసును.

ఈ సంగతి వాడికి ఎంత మాత్రమూ తెలియదు. ఇందాకటినుంచీ, ఎటు నడుస్తున్నామో, ఎక్కడకు వెళుతున్నామో, నా కాళ్ళకీ మనసుకూ తప్ప మా ఇద్దరిలో రెండో - కంటివాడికి తెలియదు.

అప్పుడే కొత్త వెన్నెల తెరిపి యిచ్చింది. గగ్గోలుగా యీదురు గుచ్చు కుంటూంది. మాగజ-గజలో అనంతంలో నిశ్శబ్దంగా ఘూర్ణిల్లే సంగీతం నిశ్శబ్దంగా ఝుంయ్ మంటూన్నది.

ఎక్కడో, ఏ మూలనో ఏవో తీగలు మ్రోగుతూన్నాయా? ఎవరో ఆలాపన చేస్తున్నారా ?

ఎవరో నాకు తెలుసును.

—"ఎందుకు కన్ను విప్పి మన వంక చూడలేదు"—అని వాడు అడగటం మరచిపోయినాడు. చీకట్లో కూర్చున్నామో, వెన్నెలముందు నిలుచున్నామో మా యిద్దరికీ తెలియదు.

కళ్ళు కూరుకు వస్తున్నాయ్. సంగీతం నిట్టూర్చే ఆలాపన, లాలిగా జంపాల లూగిస్తూంది. త్రోవ పొడుగునా, మొక్కా, మోడూ రెక్క కదల్చకుండా, మా తీరు కనిపెడుతూన్నవి. ఉన్నవీ - లేనివీ — మ్రోతలు, ఎక్కడో, ఏ మేరనో అల్లో నేరేడుగా మార్మోగుతూన్నవి. నిశ్శబ్దంలో, ఎక్కడా రవంత మేరైనా నిశ్శబ్దంగా లేదు.

"అతడు — ఆమె" అంటూ వాడు లోలో గొణుక్కుంటూన్నాడు, అపశ్రుతిగా.

"ఒరే, కృష్ణా!" తగని గద్దరింపుతో పిలిచాను. "ఒరే" అని నా చేత పిలి పించుకో నేర్చిన మాలిమి ఉన్నవాళ్ళకు నేను చేయగలిగిన ఉన్నతోన్నత - అవమానం వాళ్ళను హఠాత్తుగా పేరు పెట్టి పిలవడం.

వాడికి యీ పిలుపులో కిటుకు తెలియదు. అందరూ పిలిచినట్లుగానే పిలిచానను కుని, అంత చీకటిలోనూ నాకు కనిపించేటట్టు తల ఝుకాయించాడు.

"అతడు — ఆమె — మధ్య చుక్కలెందుకురా?"

"ఏం లేదు. క్రిక్కిరిసి లేరని."

"అయితే మాత్రమేం? శ్రుతి ఒక్కటే"

—వాకో వాక్యంగా బుకాయిస్తున్నానని వాడి చూపులు అనుకుంటున్నాయి. సరే, వాడికి తెలియని కొన్ని విశేషాలు చెప్పక తప్పదు.

— "అమ్మణమ్మ చాలా అందగత్తె. అతి గొప్పగా పాడుతుంది. అంతకు మించిన రసికురాలు, ఈ నడుమ మనం యెరుగున్నంతలో ఎన్నడూ ఉద్భవించలేదు. అవునా?"

అవన్నీ శుద్ధ అబద్ధాలు.

అమ్మణమ్మ శుద్ధ కోతిలాగా ఉండేది. గొంతుకలో, వంతెనమీద — గుడ్స్ బళ్ళు పరుగెత్తుతూ ఉండేవి. ఆ వాడకట్టు వాళ్ళకే ఆ అమ్మాయి డోకు వచ్చేది. గుమ్మంలో వచ్చి నిలుచుంటే వీధి యావత్తూ చీకటిపడేది. దీపాలు మసక వేసేవి. ఎలెక్ట్రిక్ బల్బులు మసిపారేవి.

నిలువెత్తు ధనం పోసినా, నవనిధులూ తవ్వి తలకు ఎత్తుతామన్నా ఆ కుర్ర దాన్ని చేసుకునేందుకు యెవడూ తెగించి ముందుకు రాలేకపోయినాడు. ఇందులో

ఓ విశేషం ఉంది. అమ్మణి, ఆయిన యింటిబిడ్డ. వాళ్ళ పుట్టింటి వారిది నికార్సైన సాంప్రదాయం - అందువల్ల ఏ తలకుమాసిన ఏబ్రాసికో ఎవడికో ఒకడికి, పిల్లదాన్ని కట్టబెట్టి, బరువు దించేసుకుందామని అంత నీచంగా, ఆ తలిదండ్రులు తలపెట్టలేక పోయినారు.

ఇప్పుడంటే బస్తీలూ పల్లెటిదిక్కూ- అంటూ వార లేకుండా తెగులు మీరిపోయి నాయి కాని, అప్పటికి యింకా పట్టుదలలు జాస్తి. అందులో వాళ్ళది అగ్రహార మాయెను. ఇల్లు వరుస వారందరూ ఆ కుటుంబాన్ని నానా యాతనా పెట్టారు. చివరకు, ఆ రంపపుకోత పడలేక, వెలిగా వాళ్ళ—నడుమను ఉండలేక, ఆ బ్రాహ్మడు పిల్లా మేకతో బస్తీ జేరుకున్నాడు. పుష్కలంగా చాలినవాడు కావడం మూలాన, ఈ ఆంక్షలూ అఘాయిత్యాలూ ఆయన్ను ఏమీ చేయలేకపోయినాయి. విసిగి వేసారి ఉన్నవాడేమో, అయినా యిదే అనుకున్నాడు: నా గర్భవాసాన పుట్టింది కూతురు కాదు, కొడుకే అనుకుంటాను అని.

ఆ యింటికి యెదురుగుండా, సీనయ్య····అనే ఆయన వుంటూండేవాడు. ఆ కుర్రవాడు....అప్పటికి యిరవై ఏళ్ళు లోపు ఉంటాయేమోలే ....దీక్షితులుగారని అపర త్యాగ బ్రహ్మ, ఆయన దగ్గిర సంగీతం చెప్పుకుంటూ వుండేవాడు. ఆ యింట్లో అంటే, ఆ యిల్లు సీనయ్య సొంతం కాదు. వాళ్ళ తాతా ముత్తవది. తల్లీ దండ్రీ అర్ధాల నాడే పోతే ఆ ముదుసలులు, ఈ కసిగాయను చూసుకుంటూ బ్రతుకుతున్నారు. వాళ్ళయినా యింత ఉన్నవాళ్ళు కాదు. సీనయ్య తాత ఉపాదానం చేసేవాడు. అయితేనేం, అంతలోనే చాలా గౌరవంగా వెలితి బడకుండా కాలక్షేపం చేసేవాడు. సద్బ్రాహ్మణుడు. మంచి కర్మిష్ఠి. ఘనాంతస్వాధ్యాయి కూడాను.

సీనయ్య బంగారు తండ్రి. మేలిమి కరిగిపోసినట్లు ఉండేవాడు. కంఠంలో వేయి కిన్నెరలు పలికేవి. నేను బాగా యెరుగున్నాను కదూ. ఆ త్రోవ పోయేవాళ్ళు, ఆ వేళకు సీనయ్య పాడుతూన్నట్టాయెనా, అలా మంత్ర బద్ధులులాగా నిలబడి పోవాలిసిందే.

ఎదురూ బదురూ యిళ్ళే కనక, అమ్మణికి ఆ పాట వినబడుతూండేది.

అక్కడ పాట మానినా, ఆ గొంతు తనలో మ్రోగుతూనే వుండేది.

వసవల్చని పసిపాపలాగా తెములుకు రావడానికి గిజగిల కొట్టుకుంటూండేది. అమ్మణి, మీటిన తంబుర తీగెలాగా కంపించి పోతూండేది. చివరకు ఒకనాడు కెవ్వున

కోకిల అయిపోయింది. అన్నాళ్ళుగా కుమిలి కుమిలి లోలో ఘూర్ణిల్లిన మాధుర్యం కంఠాన్ని అల్లుకుపోయి, పొర్లిపోయింది. కుర్రది అంతులేని ఆలాపనతో, సొలసి పడిపోయింది.

తల్లి దండ్రులు ఏమనుకున్నా రనుకున్నావు? ఏదో గాలో, ధూళో - ఇహ జపాలు కావు, తపాలు కావు. ఉహుఁ, పట్టిన ఘాతం లొంగిరాలేదు. పాట మానలేదు.

చివరకు విసుగెత్తి వాళ్ళ మానాన వాళ్ళే ఊరుకున్నారు. డాక్టర్లకు చూపిస్తే, "మీ అమ్మాయికి ఏమీ జబ్బు లేనిదే, ఎందుకర్రా అలా హైరాన పెడతారు?" అని వాళ్ళు దూకలేయడ మాయెను. పోనీ పిచ్చిగా వెర్రిగా ఏమన్నా ఉంటుందా అంటే, పిల్ల సలక్షణంగా వుండెను. "పోనీలే ఏదైతేనేం, ఈ కాలానికి యిదో వింత! దాని గొంతుఎలా వుంటే మనకెందుకు?" అని సరిపెట్టుకు ఊరుకున్నారు.

ఇలా, ఓ ఏణ్ణర్ధం గడిచిందనుకో: అప్పటికి అమ్మణి యీడేరి నాలుగు సంవత్సరాలు దాటి వుంటుంది. మొదట నే చెపితినగా, పిల్లదానికి పెళ్ళి అవుతుందనే ఆశ, వాళ్ళు ఎన్నడో వదులుకున్నారని! సరే ఓనాడు ఏం జరిగిందంటే, అమ్మణి వాళ్ళ అమ్మను నిలవేసింది. "అమ్మా, మరి నా పెళ్ళి యెప్పుడే?" అని. ఆ ఇల్లాలు ఉలిక్కిపడి, తెల్లమొగం వేసింది. అమ్మణి ఆ మాటే ఒకసారి కింకోసారి రెట్టించి, మరి కొంచెం దిగ్గరగా అడిగి వుంటుంది. దాంతో ఆవిడ ఖంగారుపడి, "ఇదేదో గ్రహలక్షణమే, ఈసారి తప్పకుండా" అనుకుంటూ వెళ్ళి వాళ్ళ ఆయనతో చెప్పి, ఆయన్ని అక్కడికి లాక్కొచ్చింది.

ఇంతకుముందు, తల్లిని అడిగిన ప్రశ్నే తండ్రినీ అడిగింది అమ్మణి. ఎలాగూ మొగవాడు కనుక, ఆవిడలాగా బెంబేలు పడకుండా ఆయన "రానీ అమ్మా. ఆ ఘడియ రానీ" అన్నాడు.

"ఎప్పుడొస్తుందీ?"

"వచ్చినప్పుడు."

"వస్తే వద్దు పొమ్మనవు కదా?"

"అంతకంటేనా తల్లీ!"

"అయితే రేపు సాయంకాలం."

"అది మన చేతుల్లో ఉందా అమ్మా! అంతా దైవ యత్నం."

"నా దైవం నా చేతిలోనే ఉంటాడు నాన్నా!"

ఫక్కున నవ్వింది. వాళ్ళ అమ్మ తెల్లమొగం వేసింది. వాళ్ళ నాన్నకు అంతా అయోమయంగా ఉంది. ఆయన, అలాగే నిలుచున్నచోటనే చోద్యమైపోయినాడు.

అమ్మణి లేడిలాగా పరిగెత్తింది, వాళ్ళ యింట్లోకి. వాళ్ళ అవ్వ గుమ్మంలో కూర్చుని బియ్యం బాగుచేసుకుంటూ పలుకరించుదామని తల ఎత్తేలోపుగానే అమ్మణి దూసుకుపోయింది.

సీనయ్య, ఏదో కీర్తన చూసి వ్రాసుకుంటున్నాడు.

"ఏయ్ పెళ్ళికొడుకా" అని గద్దించింది అమ్మణి. సీనయ్య అట్టె మ్రాన్పడిపోయి, కొంటెగా "ఏం పెళ్ళికూతురా!" అని నవ్వుతూ, నవ్వుకుంటూ తల వంచుకుని మళ్ళా వ్రాసుకోబోతూ, ఆ చూపులవంక చూసి గడ్డకట్టుకుపోయినాడు. కరిగి నీరైనాడు. మంచులాగా పేరుకున్నాడు. మీగడలాగా తోడుకుంది మనసు....మల్లెపూవై త్తయిపోయింది. ఈ చేతిని, ఆ చేయి అందుకుంది. ఆకారాలు ఎక్కడి వక్కడ చిందులు త్రొక్కినవి.

తలుపు దబా దిబా మోదింది, అమ్మణి యింటికి పరుగెత్తుకుంటూపోయి. "వస్తూన్నానని మొత్తుకుంటూంటే నిలవ్వేమే, అంత విల–విల లాడతావేమే." అని కసురుకుంటూ వచ్చి వాళ్ళ అమ్మ తలుపుతీసింది.

"ఏం, లోపలికి రావేం" అంది, ఎంత సేపటికీ అమ్మణి అక్కడనుంచి కదలకపోవడం చూసి.

"సరే, వస్తాను. కాని, నేను ఒక్కటి అడుగుతాను చెప్పు" అంది అమ్మణి.

"అడిగితే చెప్పక, నాకేం కొమ్ములు మొలుచుకు వచ్చా యనుకున్నావా ఏం, ఈ కాస్సేపటిలో? అడుగూ" అన్నది ఆవిడ.

"రేపు నేనూ, శ్రీనివాసరావూ వస్తే తలుపు తీస్తావా?"

వాళ్ళ అమ్మ పకాల్ మనబోయింది. అంతలో ఆగి, అతి జాలిగా "అమ్మదూ–అసి నీ కడుపుడకా" అన్నది.

తల్లి-దండ్రుల కళ్ళు రాద్ధాంత, సిద్ధాంతాలు చేసుకున్నవి. మనసులు అన్నీ పట్టుపట్టి మంచి ముహూర్తం స్థిరపరచినవి.

ఈ యింట పిచ్చి, ఆ యింట వెలసింది అనుకున్నారు వాళ్ళూ వీళ్ళూ. సీనుకు మతిపోయిందని తాతా ముత్తవల గుండెల్లో రాయిపడ్డది. అయినా, అటువంక ఆక్షేయ పౌరుషేయములకు ఏ వంకా లేదాయెను. పైగా కొల్లలుగా లక్ష్మి ప్రసన్నం కానుండెను. ఏలాగో మూతీ, ముక్కూ ముడుచుకుంటూ, సణుక్కుంటూ, గొణుక్కుంటూ, మొత్తానికి మూడు ముళ్ళూ పడవేయనిచ్చారు.

ఈ మాఘంలో పెళ్ళయిందనుకో, వైశాఖశుద్ధంలో అమ్మణి కాపురానికి వెళ్ళింది - అంటే, సీనయ్య కాపురానికి వచ్చాడు....చిలకా గోరింకల్లాగా కాపురం చేస్తున్నారు....ఏడాది తిరిగేప్పటికల్లా, అమ్మణి పిల్ల తల్లయింది.

ఆ పసిది, అచ్చంగా అమ్మణి నోట్లోంచి మూడు మూర్తులా ఊడిపడ్డట్టు పుట్టుకు చక్కా వచ్చింది, అంతకన్నా అనాకారిగా. మగత తీరి, పొత్తిళ్ళలో పసిపాపను చూసీ చూడటంతోనే, అమ్మణి కెవ్వని ఓ గావుకేక పెట్టింది. ఇహ చూసుకో, పుతాలు పెడుతూన్నట్టు జ్వరం వేసుకొచ్చింది. ఓ పిచ్చి మాటలు కావు, ఓ వెర్రి మాటలు కావు, అదే ఆలాపన. ఆ గుడ్డును పక్కలో ఉండనిచ్చేదికాదు. దగ్గరకు తీసుకు రానిచ్చేదే కాదు అసలు. మళ్ళీ బ్రతికి బట్ట కట్టేటప్పటికి ఆరు మాసములు పట్టింది. ఈ లోపుగా, ఆదిలోనే ఏదో ఓనాడు ఆ చంటిది కాస్తా గుటుక్కు మన్నది.

అమ్మణికి ఒళ్ళు తెలిసి, కళ్ల తెరపిని పడగానే, అంత నీరసంలోనూ ఆ చెయ్యి పక్కలో పాపకోసం దేవుళ్ళాడింది. ఆ వేళ్ళు పక్కబట్టలను ఉత్తుత్తిగా, అలా కాస్సేపు తడిమి, అక్కడే పిడచకట్టుకు పోయినవి. మళ్ళా అంతలో మనిషి సాపుగా నీరసించి పోయింది.

ఈ ఆరు మాసములూ సీనయ్య, మన్ను దిన్న పాములాగా పడి ఉండేవాడు. ఉలకడు, పలకడు. కూర్చుంటే అదే కూర్చోడం; నిలుచుంటే అదే నించోడం; వాల్మీకి లాగా తల దువ్వేసుకు పోయింది. ఒళ్ళు పుట్టలు పెట్టుకుపోయింది. ఏదో లోకంలో ఉన్నట్టు ఉండేవాడు.

అమ్మణి క్రమంగా కోలుకుంది. బంగారు బొమ్మైపోయింది. సీనయ్య తన చక్కదనమంతా అమ్మణికి తపస్సుగా ధారపోశాడయ్యా. వడపోసిన తరువాత తేరే మడ్డిలాగా తాను తేలాడయ్యా.

ఈ వింత జరగడంతో, మరీ పుట్టి మునిగిపోయింది. దయ్యాలూ, భూతాలూ తమ అందరిమీదా ఎక్కి తందనా లాడుతూన్నవని, ఆ తలిదండ్రులు అనుకున్నారు. కనపడ్డ దేవుళ్ళకల్లా మ్రొక్కారు. కాని, వాళ్ళ మనసుకు యెంత మాత్రమూ శాంతి అంటూ లేకపోయింది.

అమ్మణికి రంగు మారింది. దాంతోబాటు మనసు కూడా మారింది. ఇదివరకల్లా నాదారుగా, మందకొడిగా ఉంటూన్న పిల్ల, మెరికలాగా తయారైంది అని అనుకున్నారు లోకులు.

కాని, అసలు సంగతి ఏమిటంటే, అమ్మణి చిన్నప్పటినుంచీ కూడా సిసింద్రీ లాటిదే. అయితే తాను అనాకారి గనుక, నలుగురికీ తన ముద్దూ, మురిపెమూ చూపించడానికి జంకేది సహజంగా. మసిపాతను కట్టిన మాణిక్యంలాగా, మాటునపడి ఉన్నాయి, యింతకాలమూ ఆ తెలివితేటలు. ఇప్పుడో, సర్వతోముఖంగా విజృంభించినవి. తల్లీదండ్రీ ఆ హద్దుమీరిన తనానికి ఉక్కిరి బిక్కిరౌతూ, ఎన్నాళ్ళు చూసినా దరీ, అంతూ కనబడక, ఉన్న మడీమాన్యం యావత్తూ అల్లుడికి అప్పగించి, కృష్ణా రామా అనుకుంటూ, కాశీకి చక్కా పోయినారు.

ఆ యింట్లో యిద్దరూ ఒంటరిగా మిగిలారు. ఎదురూ బదురూ కూర్చున్నా, ఎంత చెట్టా—పట్టాలు వేసుకు తిరుగుతున్నా, ఎవరికి వారు, ఆ యింట్లో బిక్—బిక్‌మంటూ, ఉంటూన్నట్టు ఫీల్ అయేవారు. ఇద్దరూ కాలు కాలిన పిల్లులు.

ఇలా ఒక ఏడు గడిచింది.

ఒక ఏడు గడిచింది, అని నేను యిప్పుడు ఇంత సులాగ్గా చెప్పేస్తున్నాను. కాని, వాళ్ళకు ఆ ఏడాదిపాటులో, ఎన్ని మన్వంతరాలు పదేపదే గిర్రున తిరిగినవో. ఒక్క నిమిషానికి, వెయ్యేళ్ళ ఆయుస్సు పోసుకుంది వాళ్ళ ఆవేదన.

ఆవేదన. ఆ మాటకు అంతో, యింతో అర్థం నీకూ, నాకూ తెలుసుననుకో. వాళ్ళకు దాని ముక్కూ, మొగమూ తెలియలేదు.

అంటే, సీనుకు అన్నా తెలియలేదా? అని నీవు అడగవచ్చు.

తెలియలేదు. ఎందుచేతనో తెలుసునా? అదివరకంటే ఏది కావాలో, ఏం లోపమో తెలిసి, గుండె కరిగి — కరిగి అదే తపస్సై ప్రవహించింది. అంతవరకూ మనసుకు ఆరాటం తగ్గింది.

ఈ విషయం అలాటిది కాదుగా! ఎందుకోసమో, ఏది ఆరాటమో తెలియని పట్టి అయోమయం. తనను తాను తెలుసుకుని, కుదుటపడగల వయసూ, అనుభవమూ లేదు అప్పటికి సీనాయ్‌కి.

కొన్ని లౌక్యానికి సంబంధించినవి ఉంటాయి చూడు. గోదాదేవి ఒళ్ళు పులకరించి పడుంటే, అభమూ శుభమూ తెలియని విష్ణుచిత్తుడు, ఒళ్ళు పట్టిచూసి, హడలిపోయి, ఆ పాళాన, పిల్లదానికి వేయిపుట్ల జ్వరం వేసుకు వచ్చిందని, యమ—ఖంగారుగా వటపత్రశాయితో విన్నవించుకున్నాడా, లేదా? గడ్డం, మీసం నెరసినవాడైనా, కామజ్వరం కవళిక ఏమో కలలోనైనా తెలియని ఛాందసుడు కాడా?

ఇదీ అలాగే! సీనయ్య కూడా ఆ రోజుల్లో అంతే.

మరచిపోయి పాట పాడేవాడే కాని, ఆ చెప్పరాని బాధ రవంతసేపైనా మరచిపోయేందుకు, పాట పాడకుండా మనుకోలేక పోయేవాడు. సంగీతం కూడా అతని చెప్పుచేతల్లో మెలగవలసిన అవసరం లేదనుకున్నది.

ఎంతైనా అలూ మగలు కదా? అలనా పాలనా ఎలా ఉండేది? ఎడమొగం, పెడమొగంగానే రోజులూ, వారాలూ అలా అంటీ ముట్టకుండా గడచిపోయినవా? అని కాదూ, నీ మనసులో శంక? నీకే కాదు, అమ్మణి దగ్గిర యిప్పుడు ఆ సంగతి ఎత్తి చూడు. ఆ జాణకూ అదే పెద్ద సందేహం, ఎలా గడచినవా ఆ నాళ్ళన్నీ అని. ఏదో మానవ ప్రకృతి గనుక ఎన్నడన్నా ఏటి సరిమీద ఓనాడో, అరనాడో మసిలారే అను కుందాం పోనీ. ఆ సంగతి కుర్రదానికే జ్ఞాపకం లేందే ఇప్పుడు! అదంతా ఏదో మగత.

అప్పటి వాళ్ళ సంగతి తలచుకుంటేనే యిప్పుడు మనకు ఒళ్ళంతా తేళ్ళూ, జెర్రులూ పాకుతాయి.

అలా వాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు పట్టుకు పాకులాడారు, ఆ యేడు.

ఉండగా, ఉండగా వాళ్ళకే విసుగు వేసిందో, ఏమో, ఇహ అక్కడనుంచి బయలుదేరారు. ఫలానా చోటికి అని లేకుండానే రోజులూ, వారాలూ అంటూ లెక్క లేకుండా అందం ఆనందం ముంచెత్తే ప్రదేశాల్లో అంతులేనన్ని రోజులు అలా ఉండి పోయినారు.

ఇంటికి మళ్ళా తిరిగి వచ్చారు. ఆ ఊళ్ళో అసలు వాళ్ళకు యిల్లంటూ లేదన్న సంగతి తెలుసును కదా? ఆ అద్దె యింటికే అన్నాళ్ళకు మళ్ళీ చేరుకున్నారు.

ఎలా ఉంది, అక్కడి తీరు? లోగిలి యావత్తూ దుమ్ముగ ధూళి ఎత్తుతూ ఉంది. తోటా దొడ్డీ దుబ్బేసుకుపోయింది. తాళం తుప్పుతో ఏకాండమైపోయింది.

ఎవరి యింట్లోనో దొంగతనంగా జొరబడుతున్నట్లుగా, ఎబ్బెట్టుగా యింట్లో ప్రవేశించారు. ఎవరి పక్కమీద వారు మసలుతూన్నారు.

అమ్మణి తెల్లవారుజామున ఎప్పుడో, కలత నిదురలో కెవ్వుమని లేచి కూర్చుని, పక్కలో పాకులాడుతూంది. ఆ వేళ్ళు గజగజ లాడుతూ ఏ గుర్తో తడుము కుంటు న్నాయి. ఎవ్వరికీ వినబడనంత దగ్గరగా, ఏదో కేక ఇల్లు నలుమూలలా మార్మోగు తూంది. దూలంమీద, తొట్టి తాళ్ళకు వున్న గుర్తులు వెలా తెలా పోతున్నాయి. ఇల్లంతా ఒకసారి కెవ్వున్నది.

అంత చీకటిలోనూ సీనుకు యీ కల్లోలం స్పష్టంగా కనిపించింది. అమ్మణి చూపులు పసిపాపలై, దాయ్-దాయ్‌గా చేతులు జాచినవి. సీను అంతా కళ్ళు మూసుకు చూస్తున్నాడు.

ఆద మరుపని రాత్రి అలాగే అరగిపోయి, కోడై కూసింది. సూర్యుడై ప్రొద్దెక్కి పొడిచింది. ఝాంయ్యన కూసం విడిచింది. వెలుతురు ఎంతోసేపు మొగం చెల్లక, తల్లో ఉంగరాల్లో దాక్కొని క్రమంగా కళ్ళల్లోకి కలికంగా రాచుకుంది. అమ్మణి వంక చూడలేక సీనాయ్ తల దిమ్మెక్కించుకున్నాడు.

[కవిత్వంలోకి దిగిపోతున్నాననుకునేవ్. అసలు-కథ మరచిపోవడం లేదు. నీకు అర్థమయేట్టు చెప్పేందుకని ఇదంతా మన అంతర్వాణి అయత్న-ప్రయత్నం]

ఒకరి మొగం చూడటానికి ఒకరికి మొగం చెల్లడంలేదు. ఒకరి మనసులో బాధ ఇంకొకరికి అర్థం కావడంలేదు.

కాని, ఇద్దరూ ఏదో, ఎందుకో బాధపడుతూన్నట్టు ఇంటికి వంట పట్టిపోయింది. జుమ్మంటూ దీపాలు వెలిగించి జ్యోతుల్లా ఉంచినా, మొగం ముడుచుకుని కలకల్లాడటం మానేసింది.

మరి, రోజులు ఎలా గడచేది ?

ఎలాగో వాటి మానాన అవే గడచిపోతున్నవి. కాని, కలసి గడిపేందుకు వాళ్ళలో ఒకరైనా ప్రయత్నిస్తున్నారా?

ఈ ఆలోచన అమ్మణికి కూడా ఉందేమో తెలియదు కాని, సీనుకు తట్టింది. ఇహ నేమిటి ఉపాయం.

“నేను ప్రేమిస్తున్నాను. సరే, బాగానే ఉంది. అమ్మణికీ నామీద అలాటి ఆపేక్షే ఉందా ?” ఇలా తర్కించుకున్నాడు.

లేదని ఒక్క నిమిషంలో అర్థం అయింది. రవంతలో తొణికి మాయమైన ఏ చూపో, ఏ రెప్పపాటో, ఏ నుదుటి ముడతో, మనసుకు వచ్చినట్టు ఖచ్చితంగా తెలియజెప్పి ఉంటుంది. గాలికి కదిలే ముంగురుల్లో ప్రతి ఉంగరం తనను శపిస్తూంది అనుకుంటున్నాడు.

పెదవి అదిరిందనుకో, ఒళ్ళు పులకరించినట్టు తోచిందనుకో, కళ్ళంతటా గోరు వెచ్చని కాంతులు విస్ఫారుతూన్నట్టు మెరసిందనుకో, వెడలని నిట్టూర్పులతో పలుకు తెమలని పావురాల కువ-కువ మనసులో కలక బారిందనుకో.

అవాళ అలాగే అనుకున్నాడు. పాపం కౌగిలిలో అదుముకుని అన్నాళ్ళుగా అందక వేధించిన కలను నిమిషంలో తలముక్కలుగా నిజమనిపించుకుని అలా అనుకున్నాడు.... అందుకోసం చేతులు జాచాడు.

గాలిలో కలసిపోయిన గారాల కూచి కంటికి కనబడకుండా కళ్ళు మెరసిపోయేట్టు అద్దాల పాపగా తల్లి చేతులు ధన్యమయేట్టు చేస్తూంది. కళ్ళల్లో మెలిగే చిట్టితల్లిని, కల ఎరువు తెచ్చుకున్న రూపాన్ని, గాలిలో జోలగా ఊపుతూన్నవి.

సీను చూపులు చురచుర చూస్తూన్నవి. అమ్మణి చేతుల్లోంచి కంటికి కనబడనిది, ఏదో బరువుగా క్రిందికి దొర్లి పోయింది.

అమ్మణి, సీనువంక చూసింది.

సీనుకు అప్పటికి అర్థమైంది.

తన కడుపున పడ్డబిడ్డ బంగారు తల్లి కావడానికి తపసు దారపోసేందుకు నోచుకోని నిర్భాగ్యుణ్ణి, ఆ తల్లిలో అణువు అణువూ ద్వేషిస్తూంది.

అర్థం కాకుండా ఉంటే బాగుండిపోయే విషయం, సీనుకు అర్థమైంది. ఎన్ని రాత్రులో ఎంత కాలమో, నిద్ర అనేది అసలు మాయమైపోయింది.

తాను పడుతూన్న బాధకు కారకురాలిని ద్వేషించమని ఎన్నో విధాల రెచ్చగొట్టింది మనసు. కాని, అతని ప్రకృతి అమ్మణి అవస్థను చూసి జాలిపడడం నేర్పింది, ప్రేమను క్రమంగా మాయం చేసేసింది.

అంతటితో ఇద్దరూ చెప్పరానంత దూరమైపోయినారు.

అమ్మణి ఇలా అయిపోయింది."

ఇందాకటినుంచీ నేను చెపుతూన్నదంతా వాడు ఆలకించినట్టేనా? అయితే, పరధ్యానంగా అడగలేదా, "ఏం ఆపేశావేం?" అని.

"అంతేనోయ్ సంగతి!" అని కసిరాను.

"అయితే, మనకు అర్థం కాలేదు ఎందువల్లా?" అన్నాడు ఆ మూర్ఖుడు,

"ఏమిటి?" అని నేను అడిగానని వాడు ఊహించుకుని.

"అయితే పిచ్చి ఎక్కలేదు, ఎందుచేతా?" అన్నాడు.

"ఎక్కింది, మరేమిటి? పిచ్చికి నానార్థాలు నీకు తెలియవన్న మాట. అమ్మణికి

హృదయం ఉండాలిసిన జాగాలో ఖర — దూషణులు కాపురం పెట్టారు. మగవాడంటే, అమ్మణి దృష్టిలో తనచేత కోతిలాంటి పిల్లను కనిపించబోయే వంచకుడు. దగ్గరకు వచ్చిన వాడిని దగ్ధంచేసే ఆరని అగ్నిహోత్రం ఆ కసి. అయితే, ఆ హొయలూ ఆ లయలూ అవన్నీ ఎక్కడి వంటావా? అమ్మణికి మాత్రం ఏం తెలుసునూ? అవన్నీ చుట్టూమూగే శలభాలు కనే లేనిపోని కలలు.

"అమ్మణి మామూలు మనిషే నంటావా, ఇంకా?"

"మరి, ఆ గొంతులో అమృతం."

"హాలాహలానికి అది తప్ప, లోకంలో మరో దోహదం ఏముంది? అని, అమ్మణి పరమైపోయిన వరం."

"సీనాయ్."

"తన్ను తాను దీవించుకోలేడురా బాబూ! దైవమైనా, ఆ మందభాగ్యుడికి దేవతలు కనికరించిన వరం, వరానికి అతీతుణ్ణి చేయడమే."

"అమ్మణి అంటే అతడికి ద్వేషం అనుకుంటున్నావా ఏం? ఎబ్బే లేదోయ్, ఆ కుర్రది అతని దృష్టిలో కొమ్మకాదు, పంచరంగుల కీలుబొమ్మ. ఏ ఆట ఆడినా అతనికేం?"

"అలాటి ఉత్తముడి జీవితం భగ్నమైపోలేదా అని అడుగుదామనుకుంటున్నావా? నీవు ఒక్కడివే కాదు, లోకం యావత్తూ పడే పొరబాటే అది.

"ధన్యమైపోయింది ఆ జీవితం. లోకం మరచిపోయింది. ఇచ్చిన దైవమే జ్ఞాపకం చేసుకునేందుకు జంకుతుంది. వెలిగి చల్లారే జ్యోతికన్న వెలుగుకు ఆలవాలమై క్రీనీడ ఎన్నడూ విడిచి వెలుగులోకి రానవసరం లేని దీప స్తంభం అంతకు వేయి మడుగులు ఎక్కువ నోచుకున్నది కాదూ? సీను, తాను తరించదలచుకోలేదు. ఇతరులకు తారకం కావడమే అతని ఆలాపన.

"ఇంకా అర్థం కాలేదా? కాకపోవడమే మహా - మంచిది. అసలు ఈ విషయం శివుడు, పార్వతికి అతి గోప్యంగా ఉపదేశించవలసిన ఫాయాలోది. నీ పాలబడే దుర్యోగం దానికి ప్రాప్తించింది, సీనాయి పాటలాగా. అయితేనేం, పరువు విలువ కున్నదిగా అర్థం కాని అయోమయమైపోయి."

వాడు నడుస్తూనే నిద్ర పోతున్నాడని గ్రహించాను. ఇంతటితో దక్కస్తూ కథ కంచికి వెళ్ళింది.